# అతడు రేపిన దుమారం

బాలు

అది సంతోషానికి నిలయమైవున్న చిన్న గది. ప్రజల హృదయాలను సంతోషంతో నింపే, సామ్రాజ్య ప్రస్థానం. గోడలకు తగిలించబడిన రకరకాల చిత్రపటాలు. దూరంగా పారవేసిన కుంచెలు, కాగితాలు చూస్తే అది చిత్రకారుని గది అని క్షణంలో ఊహించుకోవచ్చు. ప్రభుత్వంచేత పారితోషికాలు పొందిన చిత్రపటాలు గోడలకు తగిలించివున్నాయ్.

కూలీల కష్టాల్ని, రక్తధారలను కార్చే వారి శరీరాలను, బీద ప్రజల సంసార సాధక బాధకాలను, పల్లెటూరి వాతావరణాన్ని, పురాతన చిత్రకారుల మేధస్సును, భావి ప్రపంచంలో పైకివచ్చే కళానైపుణ్యాన్ని, కళ్ళకు గట్టేట్టున్నాయి ఆ చిత్రాలు. అక్కడక్కడ రంగులు తుడిచిన గుడ్డలు వ్రేలాడుతున్నాయి. ఎదురుగుండా టేబిల్ మీద చిత్రాన్ని గీస్తున్నాడు అతడు. అతడు మన ధోరణిలో లేడిపుడు. తన మనస్సంతా ఆ కుంచెమీద ఉంది. ప్రక్కగా రంగులు కలిపిన ప్లేటులో కుంచెను ముంచి లేవనెత్తుతున్నాడు. అప్పుడప్పుడు ఏదో ఆలోచించుకుంటూ,సిగరెట్టు కాలుస్తూగదంతా పచార్లుచేస్తూ, వెనక్కువచ్చి, ఆ చిత్రాన్ని పరిశీలిస్తూ తిరిగి ఏదో ఆలోచించుకుంటూ తన పనిలో నిమగ్నుడైపోతున్నాడు.

అది తన జీవితంలోని మార్పును వెలిబుచ్చే చిత్రం. తన హృదయం మీద ఒకమచ్చ ఏర్పడింది. ఆ మచ్చ మాసిపోవాలంటే శతాబ్దాలు యుగాలు దాటాలి. ఈ జీవితంతో ఆ మచ్చ మాసిపోదు. తన హృదయంపై వున్న ఆ మచ్చ అతనికి కనిపించడంలేదు. దానికి దాసుడయ్యే చిహ్నాలు లేవు అతడిలో. కాని దూరంగా గుడ్లెర్రజేసి చూస్తుండే సంఘం, దాని ప్రవర్తనలు ప్రతాపం చిత్రిస్తూన్నాడు. ఆ స్వరూపానికి, ఆ సంఘానికి మెరుగులు దిద్దుతున్నాడు. తన ఆలోచనలు, భావాలు అన్నీ ఆ చిత్రంలో పొందుపరుస్తున్నాడు. తనచేయి యాంత్రికంగా తిరుగుతున్నది కాని తాను ఏం చేస్తున్నాడో తనకే తెలియని ధోరణిలో లేడు. తలుపు తెరచిన చప్పుడైంది.

ఒక్కసారి వెనక్కు తిరిగి చూచి, మళ్ళీ తన పనిలో నిమగ్నుడైనాడు.

దొండపండులాంటి లేతబుగ్గల మిసిమి, ఎర్రని పెదవులు, గాలికి రెపరెప లాడుతూ నొసటిని కప్పిపుచ్చే ముంగురులు, ఉజ్జ్వల కాంతులతో మెరిసే ఒక నవయౌవనవతి వచ్చింది. మిసమిసలాడే ఆ వొయ్యారం, ఆ నడక ఆవిడ అందాన్ని వేయిరెట్లు పెంచుతున్నట్లున్నాయి.

అతడి వెనకాలే వచ్చినిలబడింది. అతడు వెనుదిరిగి చూడలేదు. ఆమె అతడి కళ్ళు మూసింది. గదంతా చీకటిగా కనిపించింది అతడికి. గలగలమనే గాజుల శబ్దం అతణ్ణి తన ధోరణిలోనికి వచ్చేట్టు చేసింది. చేతిలోని కుంచె అలాగే నిలబడి పోయింది.

“నన్ను విసిగించకు శారదా! ఎప్పుడూ వేళాకోళమేనా” అన్నాడు పటంవైపు చూస్తూ.

తాను ఆ మాట అన్నాడేగాని, మళ్ళీ నొచ్చుకున్నాడు. ఏదో విసుగు అతడి ముఖం ముఖంలో గోచరిస్తూంది.

“అదికాదండీ, ఆయనగారి దగ్గరనుండి, జాబేమైనా వచ్చిందేమోనని...” నిలిపేసింది చివరి మాటలు.

“అదా నువ్వడిగేది. ఈఉదయమే వచ్చింది. ఏదో ధోరణిలోపడి చూపించలేక పొయ్యాను. క్షమించు” అన్నాడు అతడు ఆవైపు చూస్తూ.

ఆమెనెందుకో భయంఆవరించింది. వెంటనే ఆత్రుతతో ఆదరణ ఉట్టిపడేట్టు “ఏమని వ్రాశారు?” అని అడిగింది.

“ఏమని వ్రాస్తారు. అతనికి జ్వరంగా ఉందట. ఒకసారి నిన్ను చూడాలని ఉన్నట్లు మనిద్దర్నీ ఒకసారి రమ్మన్నట్లు వ్రాశారు.

పాపం యింకా నీమీద మోజు తగ్గినట్లులేదు అతడికి...'' అన్నాడు.

ఆ మాటల్లో నిజంలేకపోలేదని ఆమెకు తెలుసు. కాని తన భావిజీవిత దశలను లెక్కించుకోకుండానే, తిరిగి రాబోయే దినాలకు స్రుతు నొక్కాలని, ఆశపడింది. అదే తన్ను, ఈ విధంగా మార్చింది. తానొనర్చిన నీచ కార్యం నిమీలిత నేత్రాలమీద నాట్యం చేసి నట్లు ఆ ముఖంలో దొర్లి పోయింది.

''నాలుగో రోజున వస్తున్నామని వ్రాశాను. సిద్ధంగా ఉండు.'' అన్నాడు అతడు తనపనిలో నిమగ్నుడౌతూ...

ఆమాటలు ఆమెకు వినిపించలా, వినిపించినా తాను ఈ ధోరణిలో లేదిపుడు. ఆలోచనలు, అనంతంగా, ఆమె మనో వీధుల్లో సంచారం సాగిస్తున్నాయ్. మొఖంనిండా విషాద రేఖలు ఆవరించాయి.

''ఆయనకు ఒకరి పరిచర్యలు అనవసరం. అసంభవం అయినప్పటికీ ఆయన్ని వదలి వచ్చే శాను. ఆయన హృదయం ఇంత మృదువైందని తెలిసికూడా ఈ పనికి ఒడిగట్టాను. కష్టదశలో ఉన్నా కనికరించేందుకు మనస్సొప్పింది కాదు. ఆయనకు బంధువులకు నౌకర్లకు కొరత లేకపో యినా సపర్యచేసేందుకు చేతులు రాలేకపోయి నాయి. ఒకవేళ నేను దగ్గరుండి మాత్రం ఏం చేయగలను. నేనుండడంవల్ల ఆయనకు కీడే గాని మేలులేదు. నన్ను చూచినపుడంతా ఆయనముఖంలో విముఖత తాండవించేది. అదే నన్ను ఈ స్థితికి తీసికొచ్చింది. ఆయనది గొప్ప మనస్సు. పోయినసారి వ్రాసినజాబులో కూడ నా క్షేమం తెలుపవలసిందిగా వ్రాశారు.''

ఆమె ఆలోచిస్తూ అటువేపునుండి యిటువేపు తిరిగింది. కిటికీగుండా వచ్చే ఆ లేత వెలుతురు ఆమె కండ్లకు సూటిగా ప్రసరిం స్తుంది. ఇతడు యింకా వ్రాసుకుంటున్నాడు. తన అవధానమంతా ఆ చిత్రంలో మిళితమై పోయినట్టుంది. మెడమీద జారే ఆ రింగుల క్రాపు ఆ వెలుతురుకు అందంగా కనబడు తూంది. ఆమె ఆలోచనలు దూరంనుండి దగ్గరే వున్న ఇతడివైపు తిరిగాయ్.

''కాని ఈయన మనస్సుఅంతకన్నా సున్నిత మైనది. ఈయన లేత హృదయం వెలుతురు కన్నా వేయిరెట్లు శుభ్రమైనది. ఈయన కళా నైపుణ్యం, భావి జీవితంలో పైకివచ్చే అవకా శాలు, పేరు ప్రతిష్ఠలు నన్ను ఆకర్షించాయి. మాటల్లో, యితనికి మనసు లేకపోయినా, ఆత్మలో అధికంగా ఉంది. నా విషయమంతా విప్పిచెప్పి నా ఉద్దేశ్యాన్ని వెలిబుచ్చినపుడు యిక అడ్డు జెప్పలేకపోయినాడు. వాస్తవి కంగా పండిపోతున్న నా జీవిత వృక్షానికి నీళ్ళు పోసి చిగురింపచేశాడు.''

''ఏం శారదా, ఏదో ఆలోచిస్తున్నట్లు న్నావ్. అతన్ని గురించేనా?'' అన్నాడు ఇతడు వెలితిగా.

''ఆ ప్రశ్న ఆమె ఊహాతరంగాలకు అడ్డు తగిలింది.

''నాకేదో బెంగగా ఉందండీ వారిని చూడ బోతున్నామంటే...'' చివర మాటలు మింగే సింది.

''అవును నీచాదస్తం. సిగ్గుగా ఉందా నువ్వు చేసిన పని మంచిదికాదని. వెర్రిపిల్ల. స్త్రీలకు సర్వహక్కు లున్నాయని అతనికి గూడా తెలుసులే. హిందూ శాస్త్రం భర్తల కిచ్చిన హక్కులను నీమీద రుద్ది కేవలం నిన్ను బాని సగా చేసుకొని, నీ ఎముకలను, శరీరాన్ని బలి చేసుకొనేంతటి మూర్ఖుడు కాడతడు. కొంత చదువు లోపమైనా విజ్ఞానం లేకపోలేదు'' అన్నాడు.

ఇతడి ముఖంలో గాంభీర్యం వెలసింది. గాంభీర్యం నుండి సంతోష చ్ఛాయలు, తొంగి చూచాయి. ఆమె వాటిని అర్థం చేసుకోలేక ప్రతిమలా నిలబడిపోయింది.

* * *

పెద్దహాలు. రంగులద్దాలతో అమర్చబడిన కిటికీలకు మల్లెపొద అల్లుకుని అందంగా కన బడుతూంది. లోపల పెద్దపెద్ద బీరువాలనిండా రకరకాల పుస్తకాలు అమర్చబడివున్నాయ్. గోడలకు తగిలించివున్న రకరకాల నగ్న చిత్రాలు వింతగా కనబడుతున్నాయ్. ప్రక్కగా ఓమూల ఒక మంచం, దానిప్రక్కన ఒక రంగుల తివాసి. ప్రక్కనే వున్న టేబిల్

మీద వెండి మరచెంబు, గ్లాసు, ఆపిల్ నారింజపండ్లు మొదలైనవి ఏర్పరచి వున్నాయ్. క్రింద కాల్చిన సిగరెట్టు ముక్కలు కొద్దిగా పడివున్నాయ్. గాలికి రెప రెప లాడుతూ అర్ధభాగాన్ని, కప్పివుచ్చే కిటికీ గుడ్డలను చూస్తే స్వర్గలోకంలా ఉందా గది. ఆ గదిలో అతడు అటూ ఇటూ పచారు చేస్తూ, జ్ఞాపకం వచ్చినపుడు, ఆతురతతో కిటికీ గుండా క్రిందికి చూస్తూ, తిరిగి వెనక్కు వెళ్ళి మంచంమీద పడుకుంటున్నాడు. అతనినొసలు ముడుతలు పడివున్నాయ్. ముఖంలో గాంభీర్యం మందంగా కనబడుతూంది. ఏదో ఆవేశం ఆతురత ఆ మెరిసే నేత్రాలగుండా బయలు పడుతూన్నాయి. అతడులేచి సిగరెట్టు కాల్చి తిరిగి కిటికీ గుండా చూచాడు. అతడికి ఏమీ కనబడినట్టులేదు. లోకమంతా అంధకార మయంగా తోచి నిరుత్సాహంతో తిరిగి మంచం మీద పడుకున్నాడు.

కొంతసేపు నిశ్శబ్దంతో గడిపాడు.

క్రింద ఆవరణలో ఏదో బండి వచ్చిన చప్పుడైంది. లేచి కిటికీ గుండా క్రిందికి తొంగి చూచాడు. అతని ముఖంలో దుఃఖచ్ఛాయలు మాయమై సంతోషచ్ఛాయలు అలుముకున్నాయ్. ఏకో .ఆలోచిస్తూ తిరిగి మంచం మీద పడుకున్నాడు.

ఐదు నిమిషాలకల్లా ''మీ జబ్బు ఎలాగుంది?'' అనే జంట శబ్దం వినబడింది. సంతోష ఆవేదనలతో అతడు వారికి స్వాగతం యిస్తూ ''ఇన్ని దినాలనుండి ఈ సంతోషవార్తను ఏలా దాచారు?'' అని ప్రశ్నించేడు.

ఇతడు, ఆమె ఏదో ఆలోచిస్తూ పరికించి చూస్తూ నిలబడి పొయ్యారు.

''శారదా నాకు చెప్పకుండానే వెళ్ళి పోయావ్. నాకు తెలిస్తే నిన్ను బంధిస్తాననుకున్నావా...'' అన్నాడు అతడు.

అతడి కళ్లు పోగొట్టుకున్న వస్తువు తిరిగి పొందినపుడు కలిగే సంతోషాన్ని ప్రదర్శిస్తున్నాయి.

''అంతా నా తెలివి తక్కువ. బుద్ధి గడ్డి తినింది. కాని మీకు యింత విశాల హృదయం ఉంటుందని అనుకోలేక పొయ్యాను.''

''నాదికాదు శారదా విశాల హృదయం. సహృదయుడంటే అతడినే చెప్పుకోవాలి'' అంటూ చిత్రకారునివైపు చూచాడు.

ఇతడు ఏదో ఆలోచిస్తూ గోడకున్న చిత్ర పటాల్ని పరికిస్తున్నాడు.

ఇంతలోకే ఓ కుర్రాడు ''పిలిచారయ్యా'' అంటూ వాకిలి దగ్గరగా నిలబడ్డాడు. ''వీరికి స్నానం సిద్ధచేయించు'' అనిచెప్పాడు. కుర్రాడి వెంట అతడు వెళ్ళాడు.

ఆమె అతడి తలవైపు కూర్చుంది. కొంతసేపు నిశ్శబ్దం ఆ గదంతా ఆవహించింది. అతడు ఆమె వైపు చూస్తూ అందాన్ని తిలకిస్తున్నాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. అతడి చూపుల తీవ్రత మరింత జాస్తి అయింది. ఇదివరకు అతడి హృదయంలో లోతుగా నాటుకపోయిన కొన్ని మాటలను బయటికి లాగి పడేసే ప్రయత్నంలో వున్నట్లు కనిపించాడు.

''శారదా''

''ఆ......''

............

............

''నీవు సుఖంగా దాంపత్య జీవితం గడుపుతున్నా వనుకుంటాను.''

ఆమె ముఖంలో సిగ్గు తెరలు ఆవరించాయ్. తలవంచుకుని కదులుతున్న కాలిగ్రేళ్ళను, చూస్తూ కొన్ని క్షణాలు ఆలోచించింది.

''ఆ...వారు చాల దయగా వుంటారు'' అంది. ఆ మాటల్లో కొంత సంతోషం, కొంత సిగ్గు వుందని అతడూ గ్రహించలేక పోలేదు.

''అవును నాకు తెలుసు. అతని హృదయం వెన్నెలకన్నా చాల సున్నితమైంది. చక్కని కళా నిపుణుడు. కళంటే అభిరుచి ఎక్కువ కాని శారదా! నిన్ను యీ యినుప సంకెళ్ళలో బంధించుకుంటా ననుకున్నావా? యీ నాలుగు మంచంకోళ్ళకు కట్టివేసుకుంటాననుకున్నావా?

''పాశ్చాత్య దేశాల్లో భార్యలు, భర్తలకు, విడాకులిచ్చి పర పురుష సంపర్కం కోసం, కుటుంబాల సైతం త్యజించటం లేదూ? తమ ఆశయాలను, ఉద్దేశాలను, దిగమ్రింగి సంఘం యిచ్చిన భర్తలకు, ఉపచర్యలు చేసుకోవడం అనేదే హిందూ శాస్త్రం. దాని ప్రకారం

సంఘానికి జంకి యీ యినుప త్రాళ్ళతో నిన్ను కట్టేస్తా ననుకున్నావా. పురుషునివలె స్త్రీకీ హక్కులున్నాయ్. ఆ హక్కులు యితర దేశాల్లో చెల్లుబడి కొచ్చాయ్. వారిలాగు మన దేశం కావాలంటె ఎన్నో యుగాలు దొర్లి పోవాలి. తీరని జబ్బుతో భర్తగా యుండేందుకు అనర్హుడినైనపుడు భర్తహక్కులు నాకెందుకు? ఈ శాస్త్రాల సలహాలు నాకెందుకు ...శారదా ఇవి నా తుదిమాటలు, నా ఆశీర్వాదాలు. మీ రిద్దరూ సుఖంగా సంసారం చేయండి. ఇంతకంటే నేను కోరేదేమీ లేదు. నీతో సౌఖ్యం అనుభవించే భాగ్యం నాకు లేకపోయినా నీ సౌఖ్యం గూడా నేనెందుకు భంగ పర్చాలి,''

అతడి చెక్కిళ్ళ మీద జారే కన్నీళ్లు ఆ కిటికీ వెలుతురుకు ముత్యాల్లా మెరుస్తున్నాయ్. ఆమె హృదయం కంపించి పోయింది. ఆమె అతడి దగ్గరకు చేరి పైట చెంగుతో కన్నీరు తుడుస్తూ ఓదార్పు మాటలు పలికింది. అతడికి ఆమాటలు వినిపించలేదు. అతడి ముఖంలోని గాంభీర్యం పైకుబికింది.

''లేదు శారదా. నీ జీవితాన్ని గురించే నాకు దుఃఖం కలిగింది. సున్నితంగా ఈ చెట్ల గాలులకు పెరిగిన నీ శరీరాన్ని గురించే నా మనోవ్యధ మరీ ఎక్కువైంది. ఈ సంఘం నిన్ను చిన్న చూపు చూస్తుందనే దుఃఖంతో కృశించి పోతున్నాను శారదా! సంఘం నిన్ను భయపెడుతుంది, పీడిస్తుంది. అదే దాని కర్తవ్యం. వీటన్నిటికి నీవు లొంగిపోయావంటే కళంకం ఏర్పడుతుంది. అదే నా బెంగ. నీవు సంతోషంగా ఎక్కడున్నా ఒకటే. అదే నా సుఖం, నా ఆనందం... అదే నామనోవ్యధకు దివ్యౌషధం'' అన్నాడు అతడు ఆమె భుజంమీద చేయివేసి.

ఆమె తన పైటచెంగుతో కన్నీళ్ళను తుడిచినప్పుడు అతడు అవ్యక్తమైన ఆనందాన్ని అనుభవించాడు. అతడు చెప్పవలసిన తుదిమాటలు చెప్పినందుకు మనస్సు శాంతి పడింది. కాని శారద హృదయంలో కల్లోలం రేగింది. అతడి మాటలు, చేష్టలు, అగ్నిజ్వాలల్లా ఆమెను ఆవరించాయ్. తన ఉద్దేశ్యాలు, ఊహాలు, నిప్పుమీద వెన్నలా కరిగి పోయాయ్. ఆమెను ఆవరించిన సంతాపం ఈనాటికీ ఆమెను దహిస్తూనే వుంది.

# అర్థంలేని ప్రయాణం

మా. సు. చక్రవర్తి

నాగపూర్‌కి ప్రయాణం. కూడా ఇంకెవరో ఉన్నారు. మగవాడే. ఎందుకు నాగపూర్‌కి? ఇంకేముందక్కడ? అర్థంలేని పని. అయినా తప్పనిసరి. ప్రయాణం ఆగదు, మారదు. సెలవు మీదనా ప్రయాణం? సరిగా తెలీదు. మరి ఇక్కడి ఉద్యోగం? ఉంది. దానికీ నాకూ లంకె.

స్టేషన్లో ఉన్నాం. నేను, అతడు. అతడు పాశ్చాత్య దుస్తుల్లో ఉన్నాడు. నేను? సరిగా తెలీదు. టికెట్ కొన్నాను. అంటే, కొనుక్కున్నాను. అతడు కొన్నాడో లేదో. కొనే ఉంటాడు. అతడూ నాగపూరికే కదూ. ఔను. ఎప్పుడు కొనుక్కున్నాడో, టికెట్ కొనుక్కున్నాను. ఎందుకీ ఖర్చు? మానుకోకూడదూ? ఎంతడబ్బు! పోవలేదు. కొన్నాను టికెట్. ప్లాట్‌ఫారంమీద ఉన్నాం నేను, అతడు. అతడు సిగరెట్ కాలుస్తున్నాడు. నేను అటూ ఇటూ చూస్తున్నాను. అతడి దుస్తులు బాగున్నాయి. బండి ఎక్స్‌ప్రెస్సే కదూ? ఔను. నాగపూరికి మరింకేం బండి? పెట్టెలో సామాన్లు పెట్టుకున్నాం. ఎవరు పెట్టారో తెలీదు. మేమిద్దరం మాత్రం ఇవతలే నిలబడి ఉన్నాం. పెట్టెవైపు చూస్తున్నాం. బండిలో దీపాలున్నాయి. రాత్రివేళా? ఎక్స్‌ప్రెస్ పగలు బయలుదేరేదే కదూ. దీపాలెందుకు? చీకటిగా ఉన్నట్టే ఉంది. ప్లాట్‌ఫారంమీదంతా, బుక్‌స్టాల్‌లో, టికెట్ల కిటికీల దగ్గర దీపాలు